ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి జిల్లా వార్తలు

5★ మంగళవారం 19 ఆగస్టు 2025



సర్దార్ సర్వాయి పాపన్న ఆశయసాధనకు పాటుపడాలి

● జయంతి వేడుకలో కలెక్టర్ కోయశ్రీహర్ష



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న ఆశయసాధనకు పాటుపడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పాపన్న గౌడ్ జయంతిని కలెక్టరేట్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్, అదనపు కలెక్టర్ దాసరి వేణులు జ్యోతి ప్రజ్వలన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వీరోచిత పోరాటానికి, సమానత్వానికి ప్రతీకగా ఆయన జీవితం నిలిచిందన్నారు. గోల్కొండ కోట నుంచి ఈ ప్రాంతాన్ని ఆయన పాలించారన్నారు. సామాన్య వ్యక్తి నుంచి గోల్కొండ కోటను స్వాధీనం చేసుకుని పరిపాలన చేసే స్థాయికి ఎదిగిన మహనీయుడని తెలిపారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా గౌడసంఘం అధ్యక్షుడు అంజయ్యగౌడ్, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, నాయకులు బాలసాని వెంకటేశం, జాగిరి అంజి, పడాల సతీష్, మూల మల్లేషం, రాజమౌళి, సుజాత పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

పెద్దపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి వెంట వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఓదెల మండలం జీలకుంటకు చెందిన స్వరూప భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయిందని, ఇంది రమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరగా, పీడీ హౌసింగ్‌కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాఘ వాపూర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బొబ్బిలి సత్యనారాయణ పెద్ద బొంకూరులో సర్వే నెంబర్ 534లో 6ఎకరాల భూమికి ఎల్ఆర్ఎస్ తీసుకోకుండా ఓపెన్ ప్లాట్లను విక్రయిస్తున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు. ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన గోనెల రవి, ఎస్ లక్ష్మీ, ఓదెలు, రాజమల్లు గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి 59వ సర్వే నెంబర్‌లో 40సంవత్సరాలుగా పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్నారని, ఆ భూమి ప్రస్తుతం తన కబ్జాలో ఉందని, తనకు ఎటువంటి పట్టా లేదని మోకాపై సర్వే చేయించి పట్టాలు ఇప్పించాలని దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్‌కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎనిమిదేళ్ల తర్వాత వ్యవసాయ యాంత్రీకరణ

- 50 శాతం సబ్సిడీపై పనిముట్లు, యంత్రాలు
- జిల్లాకు రూ. 2.20 కోట్ల సబ్సిడీ కేటాయింపు
- మహిళా రైతులకు అధిక ప్రాధాన్యం




(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వ్యవసాయ రంగంలో యేటా చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా సాగులో అధునిక పని ముట్లను సబ్సిడీపై అందించే వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఎనిమిదేళ్ల తర్వాత ఆరంభానికి నోచుకున్నది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం 2 కోట్ల 20 లక్షల రూపాయల సబ్సిడీని కేటాయించింది. ఆయా మండలాల వారీగా కేటాయింపులు చేసేందుకు జిల్లా వ్యవసాయ శాఖాధికారి కసరత్తు చేస్తున్నారు. 50 శాతం సబ్సిడీపై యంత్రాలు, పనిముట్లను ఇవ్వనున్న ప్రభుత్వం మహిళా రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. వారి నుంచే దరఖాస్తులను కోరుతున్నారు. వ్యవసాయ రంగంలోనూ యంత్రాల వినియోగం రోజు రోజుకు పెరిగి పోతున్నది. సాగు విస్తీర్ణం పెరుగుతున్న కొద్ది కూలీల కొరత ఏర్పడుతున్నది. దీనిని అధిగమిం చేందుకు వివిధ రకాల యంత్రాలు మార్కెట్‌లోకి వస్తు న్నాయి. వరి నాటు వేసే యంత్రం, వరి కోత మిషన్, మొక్కజొన్న పంటను కోసే యంత్రాలు, కంకులు పట్టే యంత్రాలు, రకరకాల యంత్రాలు వినియోగంలోకి వస్తున్నాయి. వ్యవసాయ యాంత్రీకరణ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా వివిధ రకాల యంత్రాలు, పనిముట్లపై 40 నుంచి 70 శాతం వరకు సబ్సిడీ ఇస్తూ వస్తున్నది. ఈ పథకానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడే ఆరంభించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవిం చిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పథకాన్ని కొనసాగించింది. అన్ని రకాల పనిముట్లకు బదులు ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు ఇచ్చేందుకు ప్రాధాన్యతనిచ్చింది. ఎస్సీ, ఎస్టీలకు 80 శాతం సబ్సిడీపై, ఇతరులకు 50 శాతం సబ్సిడీపై ట్రాక్టర్లను అందజేశారు. ఈ పథకం ద్వారా అధికంగా గులాబీ కార్యకర్తలకే లబ్ధి చేకూర్చ డంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. అర్హులు కానీ వారికి కూడా సబ్సిడీపై ట్రాక్టర్లను అందజేశారు. ఈ పథకంలో గులాబీ నేతల జోక్యం బాగా పెరగడంతో అర్హులైన లబ్ధిదారులకు ట్రాక్టర్లు అందకుండా పోయాయి. రైతుల్లో ప్రభుత్వ తీరుపై వ్యతిరేకత పెరిగింది. పరిస్థితి గమనించిన ప్రభుత్వం 2017-18 వరకే వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని కొనసా గించింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో రెండోసారి గెలిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అటకెక్కించింది. కనీసం

(మిగతా 8వ పేజీలో)

దృశ్యం.. మధుర జ్ఞాపకం

● నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం..



సుల్తానాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అందమైన సన్నివేశాలను కెమెరాలో భద్రపరిస్తే జీవితకాలం పదిలంగానే ఉంటాయి. ఆ జ్ఞాపకాలను ఎల్లప్పుడూ చూసుకునే అవకాశం ఫొటోలతో ఉంటుంది. దృశ్యం క్షణకాలంలో చెరిగిపోతుంది. ఆ దృశ్యాన్ని బంధీ చేసేది.. మధుర స్మృతులను శాశ్వతంగా నిలిపేది ఫొటోగ్రఫీ.

ఏదో ఒక సందర్భంలో, వేడుకలో దిగిన ఫొటోలు భవిష్యత్తులో అవి నాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తాయి. ఒక ఫొటో చూసినపుడు నాటి పాత జ్ఞాపకాలు మదిలో మెదలుతాయి. ఆ క్షణంలో ఎన్నో భావోద్వేగాలు కళ్ల ముందు కదలాడుతాయి. శుభకార్యాలు, విహార యాత్రలు, ఆలయాల సందర్శనల సంతోషకరమైన క్షణాలను మన ముందుంచుతాయి. ముఖ్యంగా కుటుంబ సభ్యులతో గడిపిన మధురమైన వాటిని జీవిత చరమాంకం వరకూ మనకు గుర్తు చేస్తూ వాటికి సంబంధించిన ప్రేమ, ఆప్యాయత అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయి. యేటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఫొటోగ్రఫీలో ఎన్నో మార్పులు వచ్చాయి. గతంలో ఫొటో దిగేందుకు మరొకరి అవసరం ఉండేది. ఫొటోరీల్ డెవలప్‌చేసి ప్రింట్ వేసేవారు. ప్రస్తుతం వచ్చిన ఆధునిక టెక్నాలజీతో సెల్‌ఫోన్‌లో కెమెరా అందుబాటులోకి వచ్చాయి. దీంతో సెల్ఫీ దిగుతూ భద్రపరుచుకుంటున్నారు.

బయో మెడికల్ వ్యర్థాలతో పొంచి ఉన్న ముప్పు



- రోడ్లు, మురికి కాలువల్లో వేస్తున్న నిర్వాహకులు
- వైరస్‌ల వ్యాప్తితో అనారోగ్యాలు
- ప్రజలు, మున్సిపల్ సిబ్బంది ప్రాణాలతో ఆసుపత్రుల చెలగాటం
- తనిఖీలు జరుపని కాలుష్య నియంత్రణ మండలి...
- ఉల్లంఘనలపై రామగుండం కార్పొరేషన్ కొరడా...
- ఆసుపత్రులకు భారీ జరిమానాలు...

కోల్‌సిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు బయోమెడికల్ వ్యర్థాలను రోడ్లు, బహిరంగ ప్రదేశాలు, మురికి కాలు వల్లో పడేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి నియమించిన బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ సంస్థలకు చెందిన వాహనాలకు ఇవ్వకుండా ఇష్టానుసారం రోడ్లపై వేస్తు న్నారు. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ సంస్థలకు ఫీజులు చెల్లించవలసి వస్తుందని మెడికల్ వేస్ట్‌ను రోడ్లపై వేసి ప్రజలు, మున్సిపల్ సిబ్బంది ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

ఆసుపత్రులు, పశు వైద్యశాలల్లో వినియోగించిన సిరంజిలు, సెలైన్లు, మెడికల్ కాటన్ వేస్ట్, తొలగించిన అవయవాలను మెడికల్ వ్యర్థాలుగా పరిగణిస్తారు. వీటిని ఆసుపత్రుల్లో వేరు చేసి తెలుపు, ఎరుపు, పసుపు రంగు డబ్బాల్లో వేర్వేరుగా వేయాల్సి ఉంటుంది. వాటిని కాలుష్య నియంత్రణ మండలి గుర్తించి మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు చెందిన వాహనాలకు అందిం చాలి. వాటిని సదరు మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రత్యేక ఇన్సనరేటర్స్‌లో కాలుస్తుంది. అనంత రం ఆ వ్యర్థాలను భూమిలో పూడ్చిపెడతారు. ఈ మెడి కల్ వ్యర్థాల నిర్వహణకు కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ సూచించిన ఫీజులను వసూలు చేస్తారు.

● వందల సంఖ్యలో ఆసుపత్రులు, ల్యాబ్‌లు...

జిల్లాలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు, పలు మేజర్ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రామగుండంలో మెడికల్ కళాశాల అనుబంధంగా 350 పడకల ఆసుపత్రి, సింగరేణికి చెందిన మరో 300 పడ కల ఆసుపత్రి, ఎన్‌టీపీసీలో 50పడకల ఆసుపత్రు లున్నాయి. పెద్దపల్లిలో 100పడకల ప్రభుత్వ ఆసుపత్రి తోపాటు జిల్లాలో 10నుంచి 50పడకల ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లు, డెంటల్ క్లీనిక్‌లు, ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలు, మెడికల్ ల్యాబ్‌లు ఉన్నాయి. రోజు ఈ ఆసుపత్రులు, ల్యాబ్‌ల నుంచి కిలోల కొద్ది మెడికల్ వేస్ట్ వెలువడుతుంది. ఈ మేరకు బయో మెడికల్ రూల్స్ 1998 ప్రకారం కాలుష్యనియంత్రణ మండలి గుర్తించిన సంస్థ నుంచి సర్టిఫికెట్ పొందడంతోపాటు వ్యర్థాలను నిర్వీర్యం చేసేందుకు సదరు సంస్థకు అప్పగించాల్సి ఉంటుంది. ఈ మేరకు నెలకు కనీసంగా రూ.500 నుంచి ఆసుపత్రుల స్థాయిలను బట్టి రూ.10వేల వరకు ఫీజు ఉంటుంది. జిల్లాలోని మెజార్టీ ఆసుపత్రులు, ల్యాబ్‌లు నెలవారీ ఫీజులకు కక్కుర్తిపడి మెడికల్ వేస్ట్‌ను రోడ్లపై వేస్తున్నారు. ఆప రేషన్‌లలో తొలగించి అవయవాలను ఏకంగా మున్సి పల్ నాలాల్లో వేస్తున్నారు. దీంతో వైరస్ వ్యాపిస్తుంది.

● కార్పొరేషన్ కొరడా...

కార్పొరేషన్ పారిశుధ్య విభాగానికి చెందిన పలువురు కార్మికులు అనారోగ్యాల బారిన పడడం, ప్రజల నుంచి ఫిర్యా దులు రావడంలో నగరపాలక సంస్థకు ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న అరుణశ్రీ కఠిన చర్యలకు ఆదేశించారు. మున్సిపల్ చట్టం ప్రకారం అపరాధ రుసుములు వసూలు చేయాలని ఆదేశించారు. దీంతో రామగుండం నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది రెండు రోజుల క్రితం గోదావరి ఖనిలోని రెండు ఆసుపత్రులు, ల్యాబ్‌లకు భారీ జరిమానా విధించారు. లక్ష్మీనగర్‌లోని అదితి ఆసుపత్రికి రూ.1లక్ష, మరో ఆసుపత్రికి రూ.50వేలు, ఒక ల్యాబ్‌కు రూ.10వేల జరిమానా విధించారు.

● మున్సిపల్ సిబ్బంది ప్రాణాలతో చెలగాటం...

ఆసుపత్రుల నిర్వాహకులు బయో మెడికల్ వేస్ట్‌ను ఏకంగా రోడ్లపై వేస్తున్నారు. ఈ రహదారి గుండా వెళ్లే ప్రజ లు వైరస్ బారిన పడుతున్నారు. పలు సందర్భాల్లో చిన్న పిల్లలు నిడిల్స్ సిరంజిలతో ఆడుకుని అనారోగ్యం పాలైన ఘటనలు ఉన్నాయి. చెత్త తొలగించే మున్సిపల్ సిబ్బందికి నెలకు రూ.100 నుంచి రూ.200 ఇచ్చి వారితో వాటిని తీసుకెళ్లేలా చేస్తున్నారు. దీంతో తెలియకుండానే మున్సిపల్ సిబ్బంది ప్రాణాంతకమైన జబ్బుల బారిన పడుతున్నారు. గతంలో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో ఈ తరహా మెడికల్ వేస్ట్‌ను మున్సిపల్ వాహనాల్లో వేయడం వివాదాస్పదమైంది.

● కంపోస్ట్‌యార్డులో విస్తరిస్తున్న వైరస్...

మెడికల్ వేస్ట్‌ను మున్సిపల్ సిబ్బంది తీసుకెళ్లి కం పోస్టు యార్డులో వేస్తుండడంతో ఆ ప్రాంతంలో ప్రాణాంతకమైన వైరస్‌లు విస్తరిస్తున్నట్టు పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. రోజు డంపింగ్ వాహనాలు నడిపే డ్రైవర్లు వైరస్ బారిన పడి జ్వరం, శ్వాసకోశ వ్యాధులు, ఇతర ప్రాణాంతక జబ్బులకు గురవుతు న్నారు.

● తనిఖీలు జరుపని కాలుష్య నియంత్రణ మండలి

జిల్లాలో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ తీరుపై కాలుష్య నియంత్రణ మండలి తనిఖీలు జరుపాల్సి ఉంటుంది. రామగుండంలో కాలుష్య నియంత్రణ మం డలి ప్రాంతీయ కార్యాలయం ఉన్నా ఏరోజు ఆసుపత్రుల్లో తనిఖీలు జరపలేదనే విమర్శలున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులకు ఎన్‌ఓసీ ఇచ్చే సమయంలో మామూళ్లు వసూలు చేస్తున్నారని, ఎస్‌టీపీలు లేకున్నా అనుమతులు ఇస్తున్నారనే విమర్శలున్నాయి.

యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్‌లో 28 వేల టన్నులకు గాను ఇప్పటి వరకు 19 వేల టన్నుల యూరియా సరఫరా చేశామని, ఇంకా 2500టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. మంగళవారం వరకు 300టన్నులు, 24వ తేదీ వరకు మరో 100టన్నులు ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి వస్తాయన్నారు. రైతులు అవసరం మేరకు యూరియా కొనుగోలు చేయాలన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా ఉండేందుకు జిల్లాలో చెక్‌పోస్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలో 6,400 పైగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, ఇప్పటి వరకు 3926 లబ్ధిదారులు ఇళ్లకు ముగ్గు పోసుకున్నారని, 1466 వరకు బేస్మెంట్ వరకు నిర్మాణాలు పూర్తయ్యాయని తెలి పారు. ఆధార్ నెంబర్ ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని, ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలలో డబ్బులు జమ అవుతున్నాయని, ఇప్పటి వరకు జిల్లాలో 19కోట్ల 52లక్షలు జమ అయ్యాయని తెలిపారు. పేదలకు స్వశక్తి మహిళా సంఘాల నుంచి 4 కోట్ల 9లక్షల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, మహిళా సంఘంలో సభ్యత్వం లేని 10మంది నిరుపేద కుటుంబాలకు కలెక్టరేట్ నుంచి లక్ష రూపాయలు చొప్పున రుణం కింద అందించామన్నారు. నూతనంగా 12,165 కుటుం బాలకు రేషన్ కార్డులు జారీ చేశామని, మరో 30వేల సభ్యులను కార్డుల్లో చేర్చామన్నారు. మీసేవ కేంద్రాలు, ప్రజా పాలన కేంద్రాల ద్వారా వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలిస్తున్నామన్నారు. యువత అగ్నివీర్ కింద సైన్యంలో ఎంపికయ్యేందుకు ఆసక్తి గల 200మంది అభ్యర్థులకు సింగరేణి, ఎన్టీపీసీ సహకారంతో ఉచితంగా శిక్షణ అందిస్తున్నామన్నారు. న్యాక్ కేంద్రం ద్వారా వినోద రంగంలో మూడు నెలల శిక్షణ అందిస్తున్నామని, దీనికి చెల్లించాల్సిన ఫీజులో జిల్లా యంత్రాంగం నుంచి కొంత సబ్సిడీ ఇస్తామ న్నారు. పెద్దపల్లి రీజినల్ టాస్క్ కేంద్రం ద్వారా కోర్సులు నేర్చుకున్న యువతకు మల్టీ నేషనల్ కంపెనీలలో 3 నుంచి 7లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు లభిస్తున్నాయని, డిగ్రీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి పాసైన నిరుద్యోగులు ముందుకు వచ్చి టాస్క్ కోర్సులలో రిజిస్టర్ కావాలన్నారు. ఐటిఐ, ఏటీసీ కేంద్రాలలో అవసరమైన ఆధునిక యంత్రాలను అందుబాటులో పెట్టామన్నారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలపై అప్రమత్తతతో అధికార యంత్రాంగం ఉందని, 4కల్వర్టులు వరదల్లో మునగగా, 2 దెబ్బతిన్నాయని వీటి మరమ్మతుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎల్లంపల్లి నుంచి వస్తున్న వరదను నిరంతరం మానిటరింగ్ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

విద్య నైపుణ్యతతోనే భవిష్యత్

రామగిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యా నైపుణ్యతతోనే భవిష్యత్ బాగుంటుందని కేశోరాం ప్లాంట్ అధిపతి మందల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జేఎన్టీయూ కళాశాలలో ఓరియేంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సబ్జెక్టుకు సంబంధించిన విషయ పరిజ్ఞానం నేర్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం పరిస్థితిలో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యత దొరకడం లేదన్నారు. చదువును ఇష్టంతో చదవాలని సూచించారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గౌరవ అతిథిలుగా పెద్దపల్లి డిసిపి కరుణాకర్, గోదావరిఖని ఏసిపి మడత రమేశ్, ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్, మంథని సిఐ రాజుగౌడ్, ఎస్ఐ శ్రీనివాస్, టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తూన్న కేశోరాం ప్లాంట్ అధిపతి

యూరియా ఇవ్వకుండా రైతాంగానికి ద్రోహం చేస్తున్న బీజేపీ

- విదేశాల నుంచి యూరియా తేవడంలో కేంద్రం వైఫల్యం
- యాజమాన్యం వైఫల్యంతోనే ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తికి ఆటంకాలు
- ఆర్ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయాన్ని రామగుండంకు తరలించాలి



ఢిల్లీలో పార్లమెంట్ ఎదుట బ్యానర్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ

పెద్దపల్లి/గోదావరిఖని, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగానికి సరిపడా యూరియా కేటాయించకుండా బీజేపీ ప్రభుత్వం రైతాంగానికి ద్రోహం చేస్తుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. సోమవారం తెలంగాణ రైతాంగానికి యూరియా సమస్యలపై తాము పార్లమెంట్‌లో సోమవారం అర్జంట్‌మెంట్ మోషన్ పెట్టగా కేంద్రం అంగీకరించలేదన్నారు. మూడు నెలల నుంచి యూరియా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఢిల్లీకి వెళ్లి విజ్ఞప్తి చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. ఖరీఫ్‌లో 9.8లక్షల టన్నుల డిమాండ్ ఉంటే 30శాతం యూరియా కూడా సరఫరా చేయలేదన్నారు. ఓటు చోరీతో పాటు యూరియా చోరీకి కూడా బీజేపీ పాల్పడుతుందన్నారు. విదేశాల నుంచి యూరియాను తీసుకురావడంలో కేంద్రం వైఫల్యం చెందిందన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో యాజమాన్య వైఫల్యాలతో తరచూ ఫ్యాక్టరీ షట్‌డౌన్ అవుతుందని, 12లక్షల టన్నుల సామర్థ్యంతో నిర్మించిన పరిశ్రమలో 9లక్షల టన్నుల ఉత్పత్తి కూడా రావడం లేదన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌కు సంబంధించిన వ్యవహారాలు నోయిడా నుంచి మానిటరింగ్ చేయడం సరికాదని, ప్లాంట్ దగ్గరే కార్పొరేట్ కార్యాలయం ఉండాలన్నారు. తెలంగాణకు రావాల్సిన యూరియాను ఇతర రాష్ట్రాలకు కేటాయిస్తూ తెలంగాణ రైతాంగానికి అన్యాయం చేస్తున్నారన్నారు.

భారతదేశం ఇప్పటికీ యూరియాలో 20 శాతం, డీఏపీలో 60 శాతం, ఎంఓపీలో 100 శాతం దిగుమతులపై ఆధారపడుతోందని అన్నారు. తెలంగాణలో 50శాతం ఉన్న బీజేపీ ఎంపీలు పార్లమెంటులో ఎందుకు యూరియా కొరతపై మాట్లాడడం లేదని ప్రశ్నించారు. బీజేపీకి తెలంగాణ రైతుల పట్ల ప్రేమలేదని ఆరోపించారు. న్యాయంగా తెలంగాణకు రావాల్సిన ఎరువులను వెంటనే సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామగుండం ఎరువుల కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరిని అవలం బిస్తోందని అన్నారు. మేక్ ఇన్ ఇండియా అంటూ గొప్పలు చెప్పుకునే ప్రధాని మోదీ ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా అని నిలదీశారు. ఎరువుల కొరతపై పార్లమెంటులో చర్చ జరగాలని ఎంపీ వంశీకృష్ణ డిమాండ్ చేశారు.

ఉద్యోగం ఇవ్వడం లేదని ప్రజావాణిలో ఆత్మాహత్యాయత్నం

● ఆసుపత్రికి తరలింపు, ప్రాణాప్రాయం నుంచి బయట పడ్డ యువకుడు

6

విష జ్వరంతో పారిశుధ్య కార్మికుడు మృతి


జుట్టు స్వామి(ఫైల్)

చిగురుమామిడి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న జుట్టు స్వామి(51) అనే పారిశుధ్య కార్మికుడు సోమవారం విషజ్వరంతో మృతిచెందినట్లు గ్రామ మాజీసర్పంచ్ సన్నీల్ల వెంకటేశం తెలిపారు. స్వామికి రెండు రోజులక్రితం తీవ్రంగా జ్వరం వచ్చింది. గ్రామంలోనే వైద్యం చేసుకున్నప్పటికీ తగ్గలేదు. ప్రైవేట్ వైద్యానికి వెళ్లలేని ఆర్థికపరిస్థితి. దీంతో పరిస్థితి విషమించి జ్వరంతో మృతిచెందాడని తెలిపారు. గ్రామాల్లో దోమలు ఎక్కువగా ఉండడం వల్ల మురికి కాలువల వద్ద పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులు జ్వరాల బారిన పడుతున్నారు. కార్మికులకు గ్లౌజ్‌లు, దోమలు కుట్టకుండా ప్రత్యేక యూనిఫామ్‌లు, అందించి, పనిగంటలు తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అన్నారు.

యువకుడి ఆత్మహత్య


రాజశేఖర్(ఫైల్)

జగిత్యాలరూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల రాజశేఖర్(35) అనే యువకుడు సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం రాజశేఖర్ భార్య మూడునెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటినుంచి రాజశేఖర్ ఒంటరితనంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన రాజశేఖర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. మృతుడి తల్లి గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

● ఒకరు మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ గ్రామం రాజీవ్‌రహదారిపై సోమవారం రాత్రి కారు, ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు మృతిచెందగా అందులో ఉన్న మరోముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. ఎల్ఎండీపోలీసులు, స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హైదరాబాద్‌కి చెందిన నలుగురు కరీంనగర్‌లో ఓఫంక్షన్‌కి వచ్చి తిరిగి ఇంటికి హైదారాబాద్‌కు సోమవారంరాత్రి బయలుదేరారు. మండలంలోని ఇందిరానగర్ గ్రామం రాజీవ్ రహదారిపై వెళుతున్న కారు ముందు వెళుతున్న మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి పక్కనేఉన్న డివైడర్ దాటుకొని హైదారాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న కరీంనగర్ డిపోకి చెందిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సును ఢీకొంది. కారు బస్సు కిందికి దూసుకువెళ్లింది. ఈప్రమాదంలో కారులో డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న హైదారాబాద్‌కి చెందిన కొంగారి మృత్యుంజయ్(32) తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మిగితా ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. బస్సులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో బస్సుకింద ఇరుకున్న కారులోంచి మృతదేహన్ని, మిగతావారిని బయటకు తీశారు. మృతదేహన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.


ఇందిరానగర్ వద్ద జరిగిన కారు, బస్సు ప్రమాదం

చెరుకు రైతుకు ఏటా తప్పని తిప్పలు


జగిత్యాలలో సాగువుతున్న చెరుకు పంట

● జగిత్యాల జిల్లా నుంచి కామారెడ్డికి తరలింపునకు రవాణా చార్జీల భారం
● ముత్యంపేట కర్మాగారం లేఆఫ్‌తో రైతులకు కష్టాలు
● రూ.3 కోట్ల రవాణా చార్జీల భారం
● ప్రభుత్వ సహాయం కోసం అన్నదాతల ఎదురుచూపులు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని చెరుకు రైతులకు రవాణా చార్జీలు యేటా తప్పడం లేదు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట నిజాం దక్కన్ షుగర్ లిమిటెడ్ కర్మాగారం (ఎన్‌డీఎస్ఎల్) పదేళ్ల క్రితం లే ఆఫ్‌తో మూసివేయడంతో ప్రతీ యేటా చెరుకు రైతులు క్రషింగ్ సీజన్‌లో తిప్పలు పడుతున్నారు. జిల్లాలో పండించిన చెరుకును ఇతర ప్రాంతాలకు తరలించి అదనపు ఆర్థికభారంతో నష్టాలపాలవుతున్నారు. ప్రస్తుతం చెరుకు క్రషింగ్ సీజన్ ప్రారంభం కానుండడంతో జిల్లాలోని రైతులు తమ పంటను కామారెడ్డి జిల్లాకు తరలించి రవాణా చార్జీల భారం మోయనున్నారు. రవాణా కోసం టన్నుకు రూ.500 వ్యయం అదనంగా భరించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

చెరుకు రైతును వీడని లే ఆఫ్ కష్టాలు..

జిల్లాలో ఏకైక వ్యవసాయాధారిత కర్మాగారమైన మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కర కర్మాగారం లే ఆఫ్‌కు గురయి పదేళ్లుగా తెరుచుకోక పోవడంతో చెరుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కర్మాగారానికి నష్టాలు వస్తున్నాయన్న సాకుతో 2015 డిసెంబరు 23వ తేదీన లే ఆఫ్ ప్రకటించి కర్మా గారాన్ని మూసివేశారు. జిల్లాలోని పలు గ్రామాల్లో పండించిన చెరుకు ఇతర ప్రాంతాలకు తరలించ డానికి రవాణా చార్జీలను మోయాల్సి వస్తోంది. జిల్లాలోని చెరుకు రైతులపై సుమారు రూ.3 కోట్ల రవాణా భారం పడుతోంది. జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల్లో పండించిన చెరుకును ప్రస్తుత క్రషింగ్ సీజన్‌లో రైతులు కామారెడ్డి జిల్లాలోని పలు ప్రైవేటు ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. చెరుకు తరలింపునకు ఖర్చులు తడిచి మోపెడవుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రవాణా చార్జీలను భరించలేక ప్రభుత్వ సహాయం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

తగ్గిన చెరుకు సాగు...

గతంలో జగిత్యాల జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటగా చెరుకు సాగు చేసేవారు. ముత్యంపేటలోని కర్మాగారం మూతపడ్డ తర్వాత ప్రస్తుతం జిల్లాలో సుమారు 1500 ఎకరాల్లో మాత్రమే చెరుకు పంట సాగు అయినట్లు అధికారుల గణాంకాల ద్వారా తెలుస్తోంది. 1500 ఎకరాల్లో సుమారు 60,000 టన్నుల చెరుకు దిగుబడి వస్తోంది. జగిత్యాల జిల్లా నుంచి కామారెడ్డికి 150 కిలోమీటర్ల దూరం చెరుకును తరలించడానికి రైతుకు టన్నుకు రూ.500 వరకు ఖర్చు అవుతోంది. జిల్లాలో దిగుబడి అయిన 60 వేల టన్నులకు సుమారు రూ.3 కోట్ల రవాణా భారాన్ని రైతులు భ రించాల్సి వస్తోంది. గతంలో ముత్యంపేట శివారులో గల చక్కెర కర్మాగారానికి చెరు కు పంటను తరలించడానికి రైతులకు ఎటువంటి భారం పడేది కాదు. ప్రస్తుతం కష్టనష్టాలకు ఓర్చుకొని పండించిన చెరు కు అమ్ముకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో రవాణా ఖర్చులను ప్రభుత్వం భరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


కామారెడ్డి జిల్లాకు లారీలో తరలుతున్న చెరుకు (ఫైల్)

మంత్రికి రైతుల వినతి

జగిత్యాల జిల్లా కేంద్రానికి ఈనెల 13న వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును పలువురు చెరుకు రైతులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. జిల్లాలో 1500 ఎకరాల్లో చెరుకు సాగు చేస్తున్నామని, సుమారు 60 వేల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని మంత్రికి వివరించారు. ఇక్కడి చెరుకును కామారెడ్డిలోని గాయాత్రీ షుగర్ ఫ్యాక్టరీకి తరలించ డానికి టన్నుకు రూ.500 రవాణా భారం అదనంగా పడుతోందని, ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని మంత్రి శ్రీధర్ బాబును రైతులు కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేస్తానని హామీ ఇచ్చారు.

రవాణా చార్జీల భారం ప్రభుత్వం భరించాలి

వాకిడి సత్యంరెడ్డి, చెరుకు రైతు, కిసాన్‌సెల్ నాయకుడు, జగిత్యాల



జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కెర కర్మాగారం పరిధిలోని రైతులు కామారెడ్డి ప్రాంతంలోని కర్మాగారానికి చెరుకు రవాణా చేయడానికి టన్నుకు రూ.500 రవాణా భారం అదనంగా పడుతోం ది. రైతులపై పడుతున్న ఆర్థిక భారాన్ని ప్రభుత్వం భరించాలి. ముత్యంపేట చక్కర కర్మాగారం లే ఆఫ్‌లో ఉన్నప్పటికీ అధికారుల సూచనల మేరకు రైతులు చెరుకు సాగు చేశారు. అదనపు రవాణాచార్జీల భారంపై ఇటీవల మంత్రి శ్రీధర్‌బాబుకు సమస్యను విన్నవించాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశతో ఎదురుచూస్తున్నాం.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

● ఏడుగురి అరెస్ట్

బోయినపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానువాడ గ్రామంలో ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి ఏడుగురిని పట్టుకున్నారు. వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మానువాడ గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు సీఐ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించగా ఏడుగురు పేకాట ఆడుతూకనిపించారు. వీరినుంచి రూ.1360 నగదు, 8సెల్‌ఫోన్లు, రెండుద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఐదుగురి అరెస్టు..

జగిత్యాల క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని గోవిందుపల్లిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై జగిత్యాల పోలీసులు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారివద్ద రూ.80,600నగదు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ వివరించారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

● రెండు తులాల బంగారం అపహరణ

వీణవంక, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామ శివారులోని రేణుకఎల్లమ్మ ఆలయం, పెద్దమ్మతల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. పోలీసులు కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి ఆలయాల్లో చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి రెండున్నర తులాల బంగారం, 59తులాల వెండి ఎత్తికెళ్లారు. కొర్కల్ గ్రామస్తుడు పూదరి కృష్ణ పోలీసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. పోలీసులు క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు.

బావిలో దూకి యువకుడి బలవన్మరణం

జమ్మికుంట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన హమాలి శివ(25) అనేయువకుడు సోమవారం రాత్రి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులుతెలిపిన వివరాల ప్రకారం.. శివ కూలిపని చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. సోమవారం తల్లి మందలించడంతో రామన్నపల్లి పరిధిలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్‌లు సంఘటనస్థలాన్ని పరిశీలించారు. నీళ్ల ఎక్కువగా ఉండటంతో మంగళవారం ఉదయం మృతదేహం వెలికి తీపిస్తామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకనుతరలిస్తున్న మూడుట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గొల్లపల్లి గ్రామశివారులోని వాగు నుంచి ఇసుకను అక్ర మంగా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశామని తెలిపారు.

సజీవ సాక్ష్యం

● నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఫొటోలు సజీవసాక్ష్యాలు.. వేల అక్షరాలకన్నా, లక్షలాది శబ్దాలకన్నా దృశ్యం శక్తివంతమైనది. ఒక్క ఫొటోతో విభిన్న భావాలు ఆవిష్కరించవచ్చు. ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పలు ఛాయాచిత్రాలు ఆకట్టుకుంటున్నాయి.

- జమ్మికుంట/ధర్మపురి, ఆంధ్రజ్యోతి


● ఎల్ఎండీలో సంధ్యా సమయం


● ధర్మపురికి చెందిన ఫొటోగ్రాఫర్ వడ్లూరి రవీందర్ తీసిన ఫొటో


● బతుకు చక్రం
ఫొటోలు : ఎండీ ఘకూర్ - ఆంధ్రజ్యోతి , స్టాఫ్‌ఫొటోగ్రాఫర్




జమ్మికుంటకు చెందిన కెమరామన్ బిట్ల తిరుపతి పలు సందర్భాల్లో తీసిన ఫొటోలు

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు శిక్ష

జగిత్యాల క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ అజాగ్రత్తగా వాహనంనడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి రెండుసంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3,500 జరిమానా విధిస్తూ జిల్లాప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూసన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గంగవ్వ(55) అనే మహిళ 2021 జనవరి 24న రాయికల్ మండలం కుమ్మరిపెల్లిలో తన బంధువులు ఇంట్లో శుభకార్యానికి జగిత్యాల నుంచి టాటా ఏస్ వాహనంలో వెళ్లింది. డ్రైవర్ పరాంకుశం వంశీకృష్ణ వాహనాన్ని సెల్‌ఫోన్ మాట్లాడుతూ అజాగ్రత్తగా నడుపడంతో మోరపెల్లి గ్రామశివారులో బోల్తా పడింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న గంగవ్వ వాహనం కిందపడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కోడలు రాధ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేయగా సీఐ కృష్ణకుమార్ విచారణ చేపట్టారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, కిరణ్ సరైన సాక్ష్యులను కోర్టులోప్రవేశపెట్టారు. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి వంశీకృష్ణకు జైలుశిక్షవిధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ముద్దాయికి శిక్షపడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీఅశోక్ కుమార్ అభినందించారు.

ప్రజావాణిలో యువకుడి ఆత్మాహత్యాయత్నం

● ఉద్యోగం ఇవ్వడం లేదని ఆవేదన ● ఆసుపత్రికి తరలింపు, ప్రాణాపాయం లేదన్న వైద్యులు

పెద్దపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని బండి సతీష్ అనే యువకుడు సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన బండి సతీష్ తండ్రి మధునయ్య ప్రాథమిక పాఠశాలలో పార్ట్‌టైం స్వీపర్‌గా పని చేసేవాడు. ఈ ఏడాది జనవరి26 గణతంత్ర దినోత్సవం రోజు విధి నిర్వహణలో ఉండగా మధునయ్యకు విషపురుగు కాటు వేసింది. వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి, అక్కడినుంచి వరంగల్ ఎంజీఎంతరలించగా చికిత్స పొందుతూ జనవరి 29న మరణించాడు. కుటుంబానికి న్యాయం చేయాలని పాఠశాల ఆవరణలో మృతదేహంతో మృతుడి బంధువులు ఆందోళన చేపట్టారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ మేరకు మధునయ్య కుమారుడు బండి సతీష్ దరఖాస్తు చేసుకున్నాడు. కార్యాలయాల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని ఆందోళనకు గురైన సతీష్ సోమవారం ప్రజావాణికి వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్పందించిన అధికారులు వెంటనే 108కి ఫోన్‌చేసి సతీష్‌ని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రధానఆసుపత్రికి తరలించారు. ప్రాణాప్రాయస్థితి నుంచి బయటపడ్డాడని వైద్యులు పేర్కొన్నారు.


పురుగుల మందు తాగిన బండి సతీష్

కావేరి సీడ్ ప్లాంట్ ఎదుట రైతుల ఆందోళన

● పరిహారం చెల్లించాలని డిమాండ్


మొలంగూర్‌లో కావేరి సీడ్ ప్లాంట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

శంకరపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కావేరి సీడ్స్‌కు చెందిన ఆడ, మగ హైబ్రిడ్ వరిరకం వంగడం సాగు చేసిన రైతులకు అనుకున్న దిగుబడి రాకపోవడంతో పరిహారం చెల్లించాలని రైతులు, ఆర్గనైజర్లు శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామశివారులోని కావేరి సీడ్ ప్లాంట్ ఎదుట ఆందోళనకు దిగారు. కరీంనగర్, వరంగల్, నిజామబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలలో సీడ్ ఆర్గనైజర్లు సీడ్‌ప్లాంట్ ద్వారా తెచ్చిన హైబ్రిడ్ వరివంగడాలను రైతులకు ఇవ్వగా సాగుచేశారు. సుమారు మూడు వేళ ఎకరాలలో అనుకున్న దిగుబడి రాలేదని రైతులు ఆరోపించారు. సరైన పంట దిగుబడి రాకుంటే ఎకరాకు రూ.60వేలు పరిహారం ఇస్తామని చెప్పి సాగు చేయిం చారని రైతులు తెలిపారు. దిగుబడి చాలా తక్కువ రావడంతో ఆ వచ్చిన ధాన్యానికే డబ్బులు చెల్లించారని, పరి హారం అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వరి ధాన్యం తూకం వేసి నాలుగు నెలలు గడుస్తున్నా కంపనీ ప్రతినిధులు పరిహారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు గంటలపాటు రైతులు సీడ్ ప్లాంట్ ఎదుట ఆందోళన చేయగా ఏజీఎం ఆర్గనైజర్‌కు ఫోన్ చేసి మంగళవారం సమస్య పరిష్కారా నికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

రెండేళ్లుగా ఎదురు చూపులు

● అమలుకు నోచుకోని పీఎం విశ్వకర్మ పథకం ● పెండింగ్‌లోనే దరఖాస్తులు



చొప్పదండి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిది రకాల చేతి వృత్తుల పనివారికి శిక్షణను ఇచ్చి ఉపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పీఎం విశ్వకర్మ పథకం నిలిచిపోయింది. పాతవారికి శిక్షణ లేకపోగా కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి సైట్ ఓపెన్ కావడం లేదు. తద్వారా పథకం అమలులో జాప్యం జరుగుతోంది. రెండేళ్లుగా లబ్ధిదారులు ఎదురుచూపులు చూస్తున్నారు. అనేకమంది లబ్ధిదారుల దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. 2023లో పీఎంవిశ్వకర్మ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. 18రకాల చేతివృత్తుల పనివారికి శిక్షణను ఇచ్చి 15వేల రూపాయల విలువగల పనిముట్లను అందజేయాలని సంకల్పించి దరఖాస్తులను ఆహ్వానించారు. పథకం ప్రారంభ సమయంలో అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి ప్రోత్సహించారు. అనంతరం పథకం కాస్తా అటకెక్కింది. ఆసక్తి ఉన్న చేతివృత్తి పనివారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించగా మొదటి విడతలో కొంతమందికి శిక్షణ ఇచ్చారు. 15రోజులపాటు కరీంనగర్, జమ్మికుంటలో శిక్షణను ఇచ్చారు. వృత్తి పనుల్లో నైపుణ్యాన్ని మెరుగుపరిచే విధంగా శిక్షణను ఇచ్చి శిక్షణకు సంబంధించి ప్రోత్సాహంగా 4వేల రూపాయలను అందించారు. అనంతరం 15వేల రూపాయల టూల్ కిట్లను అందజేశారు. కొంతమందికి బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించారు. 18రకాల చేతివృత్తుల్లో వడ్రంగి, టైలరింగ్, మేస్త్రి పనుల శిక్షణ కోసం అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. మిగతా 15రకాల చేతివృత్తుల పనివారి కోసం అధికారులు ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. మండలంలో అనేకమంది దరఖాస్తు చేసుకోగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికి సైట్ ఓపెన్‌కావడం లేదు. దరఖాస్తు చేసుకున్నవారికి శిక్షణను ఇచ్చి టూల్ కిట్లు అందించాలని పలువురు కోరుతున్నారు.

● రెండేళ్లుగా ఎదురుచూస్తున్నాం..

- గోవులకొండ శ్రీనివాస్, చొప్పదండి



పీఎం విశ్వకర్మ పథకం కోసం రెండేళ్లుగా ఎదురు చూస్తున్నాను. ఏడాదిన్నర క్రితం దరఖాస్తు చేశాను. మండలానికి చెందిన కొంతమందికి మాత్రమే టూల్‌కిట్లు అందాయి. చాలామంది ఎదురుచూస్తున్నారు. శిక్షణను ఇచ్చి బ్యాంకు లోన్లు ఇప్పించాలి. పథకం అందరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.


ఎస్సారెస్పీ భూమి ఆక్రమదారులకు రిమాండ్

ధర్మారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నకిలీపత్రాలు సృష్టించి ఎస్సారెస్పీ భూమిని ఆక్రమించడమే కాకుండా, అధికారులను చంపుతామని బెదిరించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలకేంద్రంలో ఎస్సారెస్పీ సంబంధించిన భూములున్నాయి. వాటిని కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి కొనుగోలు చేశారని, భూమివద్దకు అధికారులు వెల్లగా తమను చంపుతామని బెదిరించారని ఎస్సారెస్పీ అధికారులు ఏప్రిల్ 23న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం ధర్మారం గ్రామానికి చెందిన యాంసాని మహేష్‌తోపాటు అతని కుమారులు యాంసాని మధు, యాంసాని మనోజ్‌లను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూములను కబ్జా చేసిన, వాటిని అమ్ముకున్న, ప్రజలను మోసం చేసి భూములను కాజేసిన, చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు.

బోస్టన్‌ను సందర్శించిన ఎస్‌యూ వీసీ

గణేశ్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ అమెరికా పర్యటనలో భాగంగా బోస్టన్ నగరాన్ని సందర్శించారు. అక్కడి తెలంగాణ మేధావులను, పూర్వ విద్యార్థులను కలిశారు. మీట్‌అండ్‌గ్రీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలో విద్య పాత్ర విశ్వవిద్యాలయాల బాధ్యతలు తదితర అంశాలపై చర్చించి సలహాలను తీసుకున్నారు. తెలంగాణలో విద్య పురోగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అక్కడి ప్రముఖులు డాక్టర్ జంధ్యం దివాకర్, డాక్టర్ వెంకట్ మారోజు, రాయదాసు మంతెన తదితరులు పాల్గొన్నారు.


బోస్టన్‌లో ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్



గేట్లు ఎత్తడంతో దిగువకు ఉరకలేస్తున్న శ్రీరాంసాగర్ నీరు

తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

39 గేట్లు ఎత్తి 2 లక్షల క్యూసెక్కులు విడుదల

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు సోమవారం తెరుచుకున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వరద వస్తుండడంతో 39 గేట్లు పైకి ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 1,17,148 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 72.990 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా వరద గేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 2,26,867 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,700 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటి ప్రవాహం కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నందున నదీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా రైతులు, చేపలు పట్టేవారు, పశువుల కాపరులు నదిలోకి దిగవద్దని అధికారులు కోరుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు ఎక్కువగా వస్తుండడంతో ప్రస్తుత సీజన్‌లో తొలిసారిగా నీటిని గోదావరికి వదిలిపెట్టారు.

సుందిళ్ల బ్యారేజీకి భారీ వరద



సుందిళ్ల బ్యారేజీలో భారీగా చేరిన వరదనీరు

మంథనిరూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, పై నుంచి భారీ వరద నీరు రావడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో సోమవారం గేట్లు ఎత్తి వేయడంతో భారీగా వరద నీరు దిగువ ప్రాంతమైన సుందిళ్ళ బ్యారేజీలోకి 1లక్ష 40 వేల 428 క్యూసెకుల నీరు వచ్చి చేరింది. అయితే బ్యారేజిలో ఉన్న 74గేట్లు ఎత్తి ఉండటంతో ఆనీరు దిగువ ప్రాంతానికి వదిలి వేశారు. దీంతో దిగువ ప్రాంతంలో ఉన్న ఉప్పట్ల, పోతారం, విలోచవరం, మంథని, ఖానాపూర్, ఖాన్‌సాయిపేట, అరెంద గ్రామల వరకు గోదావరిలో నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది. మరో వైపు మానేరు నదిలో నీటి ప్రవహం పెరిగింది. అడవిసోమన్‌పల్లి, వెంకటాపూర్, మల్లారం, అరెంద గ్రామల వద్ద మానేరు నది నిండుగా ప్రవహిస్తుంది.

● **శ్రీపాద ఎల్లంపల్లికి భారీగా వస్తున్న వరద**

శ్రీపాద ఎల్లంపల్లికి ఎగువ ప్రాంతం నుంచి 78,059 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, దిగువకు 32 గేట్ల ద్వారా 1,65,632 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. నంది పంప్‌హౌస్‌కు 3,150 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతుండగా, అక్కడి నుంచి మిడ్ మానేరుకు 6,300 క్యూసెక్కులను 2 పంపుల ద్వారా తరలిస్తున్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిణామాలపై

కేంద్ర ప్రభుత్వం ఆరా

హుటాహుటిన ఢిల్లీ నుంచి రామగుండానికి టెక్నికల్ టీమ్‌లు..

సాంకేతిక వైఫల్యాలపై కేంద్ర మంత్రుల దృష్టి



ఆర్‌ఎఫ్‌సీఎల్ అమ్మోనియా ప్లాంట్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది. రామగుండంలో ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ రైతాంగానికి యూరియా సరఫరా చేస్తున్నామని ప్రధాని మోదీ గతంలో ప్రకటించారు. కానీ ప్లాంట్ తరచూ సాంకేతిక అవరోధాలతో షట్‌డౌన్ కావడం, నాలుగు నెలల్లో మూడు సార్లు ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోవడంపై కేంద్రం దృష్టి పెట్టింది. ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శి రజత్ మిశ్రా ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిణామాలపై సమీక్షిస్తున్నట్టు తెలుస్తుంది. పార్లమెంట్ జరుగుతున్న సమయంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయం ఢిల్లీ నుంచి రామగుండంకు తరలించాలని, వైఫల్యాలపై విచారణ జరుపాలనే డిమాండ్లు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో చర్చనీయాంశమయ్యాయి.

పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణతోపాటు కాంగ్రెస్ ఎంపీల బృందం శనివారం కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి నడ్డాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో సాంకేతిక వైఫల్యాలను కూడా నడ్డా దృష్టికి తీసుకువచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న నడ్డ కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఎంపీ వంశీకృష్ణ గతంలోనే కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ కార్యదర్శిని కలిసి ఆర్‌ఎఫ్‌సీఎల్ వైఫల్యాలపై ఫిర్యాదు చేశారు. ఎరువులు, రసాయనాలశాఖలో స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఉన్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ ఎంపీ బలరాంనాయక్‌లు కూడా ఆర్‌ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయాన్ని రామగుండానికి తరలించాలంటూ కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శికి లేఖలు రాశారు. నాలుగు నెలల్లో మూడు సార్లు షట్‌డౌన్‌లు జరుగడం, అమ్మోనియా పైప్‌లైన్లు నాసిరకంగా నిర్మించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి రాష్ట్ర కోటాను సగానికి తగ్గించడం, కేటాయించిన కోటాలో సగం కూడా సరఫరా కాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తుంది. రెండు రోజుల క్రితం ప్లాంట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌కు చెడ్డపేరు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది కేంద్రం కుట్ర అంటూ ఆరోపణలు చేశారు. కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శికి లేఖ రాశారు.

రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రం కావడం, ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉత్పత్తి నిలిపివేతపై కుట్ర కోణంలో ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఢిల్లీ నుంచి హుటాహుటిన అధికారుల బృందాలు రామగుండానికి చేరుకుంటున్నాయి. ఇప్పటికే ఎన్‌ఎఫ్‌ఎల్, ఈఐఎల్‌కు చెందిన పలువురు అధికారులు రామగుండం చేరుకున్నారు. ఈ నెల 22వ తేదీలోగా ప్లాంట్‌లో ఉత్పత్తి దశలో పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరో వైపు ఆర్‌ఎఫ్‌సీఎల్ వ్యవహారం కేంద్ర మంత్రి దృష్టికి వెళ్లడంతో ఉన్నత స్థాయి బృందం రామగుండంకు వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తున్నది.



తపాలాశాఖ ప్రమాద బీమాతో ధీమా

● రోజుకు రూ.1.50తో రూ.10 లక్షల బీమా

● రోజుకు రూ.2తో రూ.15 లక్షల బీమా

భగత్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదాలైనా... వైద్య ఖర్చులైనా.... విద్యా ప్రయోజనా లైనా.... అత్యవసరంగా అంత్యక్రియలకు డబ్బుల అవసరానికి సామాన్యులకు బీమా పాలసీలతో తపాల శాఖ ధీమా కల్పిస్తున్నది. ఏదైనా రోడ్డు ప్రమాదం సంభవించి గాయాలైనపుడు లేదా అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లిన సందర్భాల్లో ఇలా అధికంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు పాక్షికంగా, లేనిపక్షంలో తాత్కాలిక వైకల్యం కూడా ఏర్పడవచ్చు. ఈ క్రమంలో రక్షణగా ప్రైవేటు బీమా పాలసీలు ఉన్నప్పటికీ ప్రీమియం అధికంగా ఉండటంతో వాటిపట్ల ప్రజలు ఆసక్తి కనబరచడంలేదు. ఈ తరుణంలో సామాన్యులకు అందుబాటులో ఉండేలా పలు ప్రైవేట్ కంపెనీలతో తపాలా శాఖ సంయుక్తంగా ప్రమాద బీమా పాలసీలు అందుబాటులోకి తీసుకు వచ్చింది.

● **ఎంతో భరోసా**

రోజుకు రూ.1.50తో రూ.10 లక్షలు, రూ. 2లతో రూ.15లక్షలు విలువైన బీమా పాలసీలను తపాలాశాఖ అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఏడాదికి రూ.549 ప్రీమియంతో అకాల మరణాలకు రూ.10 లక్షలు, రూ.749 ప్రీమియంతో రూ.15 లక్షల పాలసీలు అందుబాటులో ఉన్నాయి. ప్రమాదం కారణంగా శాశ్వత వైకల్యానికి పూర్తి బీమా చెల్లిస్తారు. అంగవైకల్యం కానీ, పక్షవాతం వచ్చినా పూర్తి బీమా లభిస్తుంది. ప్రమాదవశాత్తు వైద్య ఖర్చులు ఒ.పి.డి రూ.30 వేలు, లేదా ప్రమాదం జరిగినప్పుడు ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేకపోతే 10 సార్లు రూ.1500 విలువైన కన్సల్టేషన్లు వర్తిస్తాయి. ప్రమాదం జరిగి ఆసుపత్రిలో ఉంటే రూ.60 వేల వరకు చెల్లిస్తారు. ఇద్దరు పిల్లలకు విద్యా ప్రయోజనం కింద గరిష్టంగా రూ. లక్ష వరకు లభిస్తుంది. ఒకవేళ ఫీజులు తక్కువగా ఉంటే వాటినే చెల్లిస్తారు. ప్రమాదం జరిగి వ్యక్తి కోమాలోకి వెళ్తే రూ. లక్ష వరకు కవర్ చేస్తారు. ఎముకలు విరిగితే దాని ఖర్చుల నిమిత్తం రూ. లక్ష వరకు చేకూరుతుంది. తలకు ఏదైనా దెబ్బ తగిలి మానసికంగా ఇబ్బంది పడితే నాలుగు కన్సల్టెంట్లు ఉచితంగా అందించనున్నారు. ఒకరికి ప్రమాదం జరిగి వేరేచోట మరణించి ఉంటే వారి కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి రావడానికి రూ.25 వేల వరకు చెల్లిస్తారు. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులకు భరోసాగా రూ.5 వేల వరకు లభిస్తుంది.



● **అర్హతలు**

బీమా పాలసీని 18 నుంచి 65 సంవత్సరాల వయసు గల వారు ఎవరైనా తీసుకోవచ్చు. దీన్ని తెరవడానికి దగ్గరలోని తపాలా కార్యాలయానికి వెళ్తే సరిపోతుంది. ఆధార్ కార్డు, దానితో లింక్ అయిన ఫోన్ నంబరు ఉండాలి. వైద్య పరీక్షలు చేసిన తరువాత కొందరికి వర్తిస్తుంది. సాయుధ బలగాలకు ఇది వర్తించదు. ఈ అవకాశాన్ని సామన్యులు బీమా పాలసీలు పొంది వినియోగించుకోవాలని కరీంనగర్ తపాలశాఖ అధికారులు కోరుతున్నారు.

గాయత్రి పంపుహౌజ్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

● వరద కాలువకు చేరిన ఎస్సారెస్పీ నీరు



వరదకాలువను పరిశీలిస్తున్న ఎస్సారెస్పీ సీఈ సుధాకర్‌రెడ్డి

రామడుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌజ్ నుంచి మిడ్ మానేరుకు సోమవారం కూడా నీటి విడుదల కొనసాగింది. ఆదివారం నాలుగు పంపుల ద్వారా వరద కాలువకు నీటిని విడుదల చేసిన అధికారులు ఎస్సారెస్పీ నుంచి నీరు రావడంతో మూడు పంపులకు కుదించారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ నుంచి 5వేల క్యూసెక్కుల నీరు చేరుతుండడంతో గాయత్రి పంపుహౌజ్ నుంచి 10వేల క్యూసెక్కుల నీరు వరద కాలువకు వచ్చి చేరుతోంది. దీంతో రెండువైపులా నీరు రావడంతో వరద కాలువ ద్వారా 15వేల క్యూసెక్కుల నీరు మిడ్ మానేరుకు తరలివెళ్తోంది. కాగా ఎస్సారెస్పీ నీరు 18వేల క్యూసె క్కుల నీటిని వరదకాలువకు విడుదల చేయడంతో గాయత్రి పంపుహౌజ్ నుంచి నీటి విడుదలను ఆపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాత్రి వరకు ప్రస్తుతంనడిపిస్తున్న మూడు పంపులను కూడా ఆపేయనున్నారు.

రామడుగు మండలం శ్రీరాములపల్లె సమీపంలోని వరదకాలువను ఎస్సారెస్పీ సీఈ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. ఎస్సారెస్పీ నీరు, గాయత్రీ పంప్‌హౌస్ నీరు కలిసేచోట వరదకాలువను పరిశీలించారు.

మిడ్‌మానేరుకు భారీగా ఇన్‌ఫ్లో...



ప్రాజెక్ట్‌లోకి వస్తున్న నీరు

బోయినపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎల్లంపల్లి జలాల ఎత్తిపోతలతో పాటు ఎస్సారెస్పీ, మూలవాగు, మానేరు వాగు ద్వారా భారీగా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి సోమవారం సాయంత్రం వరకు 18,628 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. గాయత్రి పంప్‌హౌస్ నుంచి 9450 క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 8వేలు క్యూసెక్కులు, మూలవాగు, మానేరు వాగు ద్వారా 1178 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగు తున్నట్లు ప్రాజెక్ట్ డీఈ రాజు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 310.80ఉండగా, నీటి నిల్వ సామార్థ్యం 27.55 టీఎంసీలకు 12.591 టీఎంసీల మేరకు చేరుకుంది.

కల్లుపై దుష్ప్రచారాలను నమ్మవద్దు

తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఒక కల్లు దుకాణంలో ఊదో జరిగిందని రాష్ట్ర వ్యాప్తంగా కల్లుపై వస్తున్న దుష్ప్ర చారాలను నమ్మవద్దని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సోమవారం గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. పేద గౌడ మహిళలకు ఉచితంగా చీరలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావుగౌడ్ మాట్లాడుతూ అబ్కారీ అధికారులు గ్రామాల్లో కల్లు దుకాణాలపై దాడులు చేస్తూ వేధింపులకు గురిచేస్తే ఊరుకోబోమన్నారు. విస్కీ, బ్రాందీలో 40 శాతం ఆల్కహాల్ ఉంటుందని చెబుతున్నారని, కానీ 50 శాతం ఆల్కహాల్ ఉంటుందని, దానిపై అధికా రులు ఎందుకు తనిఖీలు చేయడం లేదని ప్రశ్నించారు. కల్లును మాత్రమే బదనాం చేస్తున్నారని ఆరోపించారు. కల్లుపై చేస్తున్న దుష్ప్రచారాలను ఎదుర్కోవడానికి గౌడ కులస్థులు ఐక్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారా యణగౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, గౌడ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఉధృతంగా కూడవెల్లి, పల్వంచ వాగులు

నిండు కుండలా ఎగువ మానేరు..



ఎగువ మానేరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ మారుతిరెడ్డి

గంబీరావుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్మాల ఎగువ మానేరు జలాశయం నిండు కుండలా మారింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు సిద్దిపేట జిల్లాలోని కూడవెల్లి వాగు, కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో నర్మాల ఎగువ మానేరు నిండుతోంది. మొత్తం మానేరు నీటి మట్టం 31 ఫీట్లు ఉండగా, సోమవారం రాత్రి వరకు 30 ఫీట్లకు చేరింది. మానేరు మత్తడి దూకి పరవళ్ల తొక్కేందుకు కేవలం ఒకే ఫీటు నీళ్ల అవసరం ఉన్నాయి. సోమవారం రాత్రి లేక మంగళవారం ఉదయం మానేరు మత్తడి దూకే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తం అయ్యారు.

మానేరు పరివాహక ప్రాంతాలకు వెళ్లొద్దు..

నర్మాల ఎగువ మానేరు డ్యాంతో పాటు మానేరు వాగు సమీప ప్రదేశాలకు వెళ్లొద్దని తహసీల్దార్ మారుతిరెడ్డి సూచించారు. నర్మాల మానేరు ప్రాజెక్టును తహసీల్దార్ మారుతిరెడ్డి సోమవారం పరిశీలించారు. మానేరు జలాశయం నిండి మత్తడి దూకేందుకు సిద్ధంగా ఉన్నందున మానేరు డ్యాం, మానేరు వాగు పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు, రైతు కూలీలు, మత్స్యకార్మికులు వెళ్లొద్దని తెలిపారు. పశువుల, గొర్లకాపరులు మేతకు తీసుకెళ్లద్దని సూచించారు. వాగు పక్కన పశువులను కట్టేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా పాత ఇళ్లలో ఉన్న వారు, ఫారెస్ట్ ప్రాంతాల సమీపాన నివాసం ఉండే వారు ఇతరత్రా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మానేరు పరిసర ప్రాంతాల గ్రామాల్లో చాటింపు వేయడంతో పాటు 24గంటల పాటు అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించటానికి సంబంధిత అధికారులను అప్రమత్తం చేశామన్నారు.

శంభో శంకరా..

● లక్ష మంది వరకు రాజన్నను దర్శించుకున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన వేములవాడ రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి క్షేత్రం సోమవారం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. సుమారు లక్ష మంది వరకు భక్తులు రాజన్న దర్శనానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో భారీగా తరలివచ్చిన భక్తులతో పట్టణ పురవీధులు, ఆలయ పరిసరాలు భక్తజన సంద్రంగా మారిపోయాయి. భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతాలయాలను సందర్శించిన భక్తులు మొక్కులు చెల్లించుకోగా, శివకల్యాణం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. రాజన్న ఆలయం ఎదుట రావిచెట్టు వద్ద దీపాలను వెలిగించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయం ముందు భాగంలోని దారి పూర్తిగా భక్తులతో కిక్కిరిసిపోయింది.

ఘనంగా మహాలింగార్చన..

శ్రావణ మాసం నాలుగో సోమవారం సందర్భంగా రాజన్న ఆలయం ఉదయం 5.30 గంటలకు అర్చకులు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.05 గంటలకు శ్రీస్వామివారి కల్యాణ మంటపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో రాధాబాయి హాజరై లింగాకృతిలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ విభాగాలను పరిశీలించిన ఈవో..

శ్రావణ మాసం నాలుగో సోమవారం సందర్భంగా రాజన్న క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ఈవో రాధాబాయి పలు విభాగాల్లో ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. కోడెల క్యూ లైన్‌లు, బ్రేక్ దర్శనం, ధర్మగుండం, ఉచిత దర్శనం క్యూలైన్‌లతో పాటుగా ఓపెన్‌స్లాబ్ ప్రాంతాలను పరిశీలించారు. వెంట ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఉన్నారు.



శివ కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ధర్మపురిలో, కోటి లింగాలలో భక్తుల పూజలు

ధర్మపురి: శ్రావణ మాసం ఆఖరి సోమవారం శివ నామస్మరణలు చేసిన భక్తులతో క్షేత్రంలోని శివాలయాలు కిట కిటలాడాయి. ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు శివుడికి జలాభిషేకం, బిల్వార్చన జరిపి అత్యంత భక్తి శ్రద్దలతో పూజించారు. శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వరునికి అన్నపూజ చేయించారు. నేరెళ్ల సాంబశివ, రాజారం, జైనా శివాలయాల్లో కూడ భక్తులు పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అను బంధ ఆలయాల్లో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు- రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు

వెల్గటూర్: శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని కోటి లింగాలకు భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్త లు గోదావరి ఒడ్డున గల గంగమ్మ తల్లికి పూజలు చేశారు. స్నాన ఘట్టాలపై ఉన్న శివ లింగాలకు భక్తితో మొక్కి కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వర్షాల కారణంగా గోదావరిలో నీటి మట్టం పెరగడంతో ఎస్సై ఉమాసాగర్ ఆధ్వర్యంలో పోలీసు పహారా నిర్వహించారు. కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి, ఆలయ ఈవో కాంతారెడ్డి భక్తులకు ఇబ్బంది కలుగకుండా పర్యవేక్షించారు.

ఎంఈడీ సెమిస్టర్ ఫలితాల విడుదల



గణేశ్‌నగర్, ఆగస్టు 18:(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2025న నిర్వహించిన ఎంఈడీ, ఒకటో, మూడో సెమిస్టర్ ఫలితాలను సోమవారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న చిత్రాలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సంప్రదాయ దుస్తులు.. జీవన విధానం.. సాంస్కృతిక వేడుకలకు సంబంధించిన చిత్రాలు ప్రహరీ పై సజీవంగా దర్శనమిస్తున్నాయి. సంప్రదాయ దుస్తులు ధరించిన గిరిజన మహిళలు, గుడిసెలు, పాడి పశువులు, అమ్మవారికి తీసుకెళ్తున్న నైవేద్యం, డోలు వాయించడం, తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న యువతుల చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామ శివారులోని జగదాంబదేవీ ఆలయం ప్రహరీ గోడపై గిరిజన మహిళల వేడుక చిత్రాలను అందంగా తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ సభ్యులు గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన కళాకారుడు చందుతో ఆకర్షణీయమైన చిత్రాలను వేయించారు. గిరిజన సంప్రదాయ పద్ధతులను ఈతరం వారికి వివరించేలా చిత్రాలు ఉన్నాయి.



తీజ్ వేడుకలకు సంబంధించిన చిత్రాలు

21 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ నెల 21 నుంచి ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సమావేశం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ నెల 21న అండర్ 14, 17 బాలికలు, 22న బాలురకు ఖోఖో, కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు. 23న అండర్ 14, 17 బాలబాలికలకు అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 9247683220, 8106523773 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వపు విద్యార్థులు

ఎలిగేడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2012-13 సంవత్సరపు పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలతో సందడిగా గడిపారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పెన్షన్ విద్రోహ దినం సెప్టెంబరు 1 హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నా విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు ముంజాల హరికృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మాడల్ స్కూల్‌లో సీపీఎస్ మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి పిలుపు మేరకు ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్‌తో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అనుముల పోచయ్య, ఉపాధ్యక్షులు పులి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, జిల్లా, మండల బాధ్యులు శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, జ్యోత్స్నశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఇసుక వేలం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గంగారంలో ఈ నెల 5న అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు తహసీల్దార్ జగదీశ్వర్‌రావు తెలిపారు. మొత్తం ఇసుక 492 టన్నులు ఉంటుందని, వేలంలో పాల్గొనే వారు రూ.500 దరావత్తు చెల్లించాలని తెలిపారు. వేలంలో ఇసుక పొందిన వారు 24 గంటలలోపు డబ్బులు చెల్లించి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

ఎంపీడీవో, ఎస్‌ఐలకు సన్మానం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్‌ను ఉత్తమ ఎంపీడీవోగా ప్రశంసపత్రం అందుకున్నారు. సోమ వారం కొత్తపల్లి గ్రామానికి చెందిన యువకులు ఎంపీడీవో శ్రీనివాస్‌ను సన్మానిం చారు. బాలసాని లెనిన్, శ్రీనివాస్, దబ్బేట అనిల్ పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎస్‌ఐ సనత్‌కుమార్ ఉత్తమ ఎస్‌ఐగా ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. మానుమండ్ల శ్రీనివాస్, దాడికుమార్, సంతోష్,అజయ్ పలువురు పాల్గొన్నారు.

మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ధర్మారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రజక కుల దైవం మడేలేశ్వర స్వామి విగ్రహాన్ని సోమవారం ఖిలావనపర్తి గ్రామంలో ప్రతిష్ఠిం చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, నాయకులు గంధం మల్లయ్య, కొత్త నర్సింహులు, చింతల జగన్మోహన్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

ఓపీ విభాగంలో కుర్చీల ఏర్పాటు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరగడంతో ఆసుపత్రి వెలుపల ఓపీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో రోగుల కోసం కలెక్టర్ కోయ శ్రీహర్ష నిధులు రూ.లక్షతో కుర్చీలను ఏర్పాటు చేసినట్టు ఆర్‌ఎంవో రాజు తెలిపారు. రోగుల సంఖ్య పెరిగి ఇబ్బందులు పడుతుండడంతో ప్రత్యేక ఓపీ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నిరసన



నిరసనలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కమాన్‌పూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల సమస్యలను పరిష్కరించాలని బస్టాండ్ వద్ద సోమవారం బీజేపీ నిరసన చేపట్టింది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సమస్యలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పలు సమస్యలతో కూడిన ఫ్లకార్డులను ప్రదర్శించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము మాట్లాడుతూ పాలకులు మారుతున్నా మండలంలో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. వ్యవసాయ భూములకు వెళ్లే రహదారులకు మెటల్ రోడ్లు వేయాలన్నారు. కమాన్‌పూర్ క్రాస్ రోడ్డు నుంచి ఆదర్శనగర్ అంబేద్కర్ విగ్రహం వరకు సెంట్రల్ లైటింగ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. కొయ్యడ సతీష్, మట్ట శంకర్, జంగపల్లి అజయ్, పోచం, మల్లారపు అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

భవిత కేంద్రాలలో ఫిజియోథెరపి సేవలకు దరఖాస్తులు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాలలో ఫిజియోథెరపి సేవలకు ఈ నెల 21 లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. అంతర్గాం, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, పెద్దపల్లి, రామగిరి, రామగుండం, శ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల్లోని కేంద్రాల్లో విద్యార్థులకు ఫిజియోథెరపి సేవలను అందించేందుకు అర్హులైన ఫిజియోథెరపీ డిగ్రీ, బీపీటీ, ఎంపీటీ విద్యార్హత ఉన్న స్థానికులకు గంటల పద్ధతిలో పని చేసేందుకు ఆసక్తి కలిగి ఉండాలన్నారు. వివరాలకు 9502746161 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

వసతి గృహాల ఆహార పదార్థాల సరఫరాకు టెండర్లు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సంక్షేమ శాఖ వసతి గృహాలు, పాఠశాల విద్యార్థులకు అవసరమైన ఆహార పదార్థాలను సరఫరా చేయడానికి ఈ నెల 22లోగా టెండర్లు సమర్పించాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్ తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి అవసరమైన కిరాణా సరుకులు, కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, క్యాటరింగ్ చేయడానికి ఆసక్తిగల వారి నుండి సీల్డ్ టెండర్లు పిలుస్తున్నట్లు తెలిపారు.

ఎనిమిదేళ్ల తర్వాత వ్యవసాయ యాంత్రీకరణ

(5వ పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ఆర్‌కేవీవై ద్వారా కేటాయించిన నిధులను సైతం సద్వినియోగం చేసుకోలేకపోయింది. 2018 యాసంగి సీజన్ నుంచి అమల్లోకి వచ్చిన రైతు బంధు పథకాన్ని సర్వరోగ నివారిణిగా చూపెట్టింది. వ్యవసాయ యాంత్రీ కరణ, జీరో వడ్డీకే పంట రుణాలు, పంటల బీమా పథకాలను అమలు చేయలేదు. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమల్లోకి తీసుకవస్తామని ప్రకటించింది. అయితే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్ మిషనరీ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్‌ఎంఏఎం) పథకం కింద జిల్లాకు 2 కోట్ల 20 లక్షల రూపాయలు సబ్సిడీ కింద కేటాయించారు. ఈ పథకం ద్వారా హ్యాండ్, పవర్ స్ప్రేయర్లు, రోటొవేటర్లు, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్స్, కల్టివే టర్లు, బండ్ ఫార్మర్స్, బ్రష్ కట్టర్లు, పవర్ టిల్లర్లు, గడ్డి కట్టలు కట్టే మిషన్లు, తదితర యంత్రాలు, పనిముట్లను 50 శాతం సబ్సిడీపై మహిళా రైతులకు అందజేయనున్నారు. సన్న, చిన్నకారు ఎస్సీ, ఎస్టీ రైతులు, మహిళా రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఎస్సీలకు 17 శాతం, ఎస్టీలకు 9 శాతం పనిముట్లు, యంత్రాలను తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. 74 శాతం బీసీలు, తక్కువ భూములు గల ఓసీ రైతులకు యూనిట్లు మంజూరు చేయనున్నారు. ఈ నెలాఖరులోగా రైతులు, మహిళా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆయా మండలాలకు చేసిన కేటాయింపులను అనుసరించి లక్ష రూపాయలలోపు యూనిట్ ఉంటే మండల వ్యవసాయ శాఖ అధికారి కన్వీనర్‌గా ఉన్న కమిటీ, యూనిట్ వ్యయం లక్షకు మించితే కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల సరఫరా

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని సన్న, చిన్న కారు, ఎస్‌సి, ఎస్‌టి, మహిళ రైతులకు 50 శాతం సబ్సిడిపై వ్యవసాయ యంత్రాల సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కాంతాల అలివేణి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి మండలానికి బ్యాటరీ స్ప్రేయర్స్ -230, పవర్ ఆపరేటర్ స్ప్రేయర్‌లు 49, రోటవేటర్స్ 14, సీడ్ కం ఫార్టీగ్రిల్ 3, ట్రాక్టర్ ద్వారా నడిపే యంత్రాల్లో కల్టివేటర్, ఎంబి క్లౌ 14, బండ్ ఫార్మన్ 3, పవర్ విడర్ 2, బ్రష్ కట్టర్ 4 కేటాయించినట్లు తెలిపారు. రైతులు మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పని ముట్లను అందిస్తున్నదని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్ 104, రోటావేటర్ 6, పవర్ టిల్లర్ 1, బ్రష్ కట్టర్ 2, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ 1, గడ్డి కట్టలు చుట్టే యంత్రం 1, తైవాన్ స్ప్రేయర్ 21, కల్టివేటర్, కేజీవీల్ 6 ఉన్నాయని వివరించారు. రైతులు ఈ నెల 23లోగా ఎలిగేడు రైతువేదికలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు పట్టాదారు పాస్‌బుక్కు, ఆధార్ కార్డు, ఫొటో, దరఖాస్తుతో జత చేసి అందించాలని తెలిపారు.

యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పెద్దపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగుకు అవసరమైన యూరియా రైతులకు చేరేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ సచివాలయం నుంచి సీఎస్ రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జూలై, ఆగస్టులో వర్షాలు కురువడంతో అనేక రకాల పంటలు రైతులు ఒకేసారి సాగు చేయడం, రాష్ట్రానికి కేటాయించిన యూరియా స్టాక్ సరఫరాలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల కొంత సమస్య ఉందన్నారు. పలు దేశాల నుంచి రావాల్సిన యూరియా సరఫరా కావడం లేదన్నారు. ఏప్రిల్ నెల నుంచి కేటాయింపుల మేరకు రాష్ట్రానికి యూరియా సరఫరా కాలేదని, మూడు లక్షల మెట్రిక్ టన్నుల తక్కువ సరఫరా జరిగిందని మంత్రి తెలిపారు. రుణ మాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, ఉచిత కరెంట్, రైతు బీమా, ధాన్యం కొనుగోలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం ఇప్పటివరకు లక్షా 13 వేల కోట్లు ఖర్చు చేసిందని, యూరియా కోసం రైతులు లైన్‌లో నిలబడటం వల్ల కొంత అసంతృప్తి చెందుతున్నారని మంత్రి తెలిపారు. రాబోయే 45 రోజుల పాటు యూరియా సరఫరా పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మండల స్థాయిలో స్టాక్ వివరాలు మానిటరింగ్ చేయాలని, ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి యూరియా తరలించాలని అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కె శ్రీహర్ష, డీసీపీ కరుణాకర్, డీఏఓ బి శ్రీనివాస్, డీసీఓ శ్రీమాల, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి రెయిన్‌కోట్ల పంపిణీ



రెయిన్ కోట్లు అందజేస్తున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి సోమవారం కమిషనర్ అరుణశ్రీ రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. పారిశుధ్య సిబ్బంది రక్షణ కోసం ఇచ్చిన కిట్లను ఉపయోగించడంతోపాటు వర్షంలో రెయిన్‌కోట్లను ధరించాలన్నారు. డీసీ వెంకటస్వామి, ఈఈ రామన్, డీఈ శాంతిస్వరూప్, ఎస్‌ఐ సంపత్ పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి : సీపీ

కోల్‌సిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కమిషనరేట్ పరిధిలో మండపాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునేవారు పోలీస్ శాఖ అనుమతి పొందాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటలో తెలిపారు. విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి సమాచారం ఆన్‌లైన్ ద్వారా అందించాలని తెలిపారు. https://policeportal.tspolice.gov.in/index.htm ఆన్‌లైన్ లింక్ ను క్లిక్ చేసి అందులో దరఖాస్తుదారుని వివరాలు, విగ్రహం ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, పోలీస్ స్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు ఫోన్ నెంబర్లు పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా వివరాలు కాని సందర్భంలో దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి) : గణపతి నవరాత్రోత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్‌ఐ దీకొండ రమేష్ అన్నారు. సోమవారం ఎస్‌ఐ ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల నిర్వాహకులు ముందుగా పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలన్నారు.

యూరియా కోసం రైతుల క్యూ



ఎలిగేడులో క్యూలో ఉన్న రైతులు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనగర్తి ఎరువుల గోదాం వద్ద యూరియా కోసం సోమవారం రైతులు బారులు తీరారు. ఎకరానికి ఒక బస్తా మాత్రమే ఇస్తున్నారని, కనీసం మూడు బస్తాలైనా ఇవ్వాలని రైతులు పేర్కొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడే యూరియా అందుబాటులో ఉన్నదని, ఎలాంటి అపోహలకు గురికావద్దని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలో ఎరువులను అందించామని ఆయన తెలిపారు. ఖరీఫ్‌లో 1500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. అదులో 980 మెట్రిక్ టన్నుల యూరియాను ముందుగానే రైతులకు అందించినట్లు ఆయన వివరించారు.

ఖనిలో గోదావరి వద్ద భారీ వరద

కోల్‌సిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీ వరద రావడంతో సోమవారం గేట్లు ఎత్తి వరదను దిగువకు వదిలారు. గోదావరిఖనిలో వరద ఉధృతి ఎక్కువగా ఉంది. సోమవారం సాయంత్రం 2లక్షల క్యూసెక్కుల వరద రావడంతో పుష్కరఘాట్ల వద్దకు నీరు చేరింది. గోదావరిఖని టుటౌన్ పోలీసులు గోదావరిలోకి ఎవరూ దిగవద్దంటూ హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. బందోబస్తు నిర్వహించారు.

దివ్యాంగురాలికి ఎలక్ట్రికల్ బ్యాటరీ వీల్ చైర్ పంపిణీ



వీల్‌చైర్ అందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాళ్లు, చేతులు, నడుము పనిచేయడం లేదని, ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనం కావాలని దివ్యాంగురాలు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న వెంటనే స్పందించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎలక్ట్రికల్ బ్యాటరీ వీల్ చైర్ రెండు గంటల్లోనే తెప్పించి అందజేశారు. కాల్వశ్రీరాంపూర్ మండలానికి చెందిన తిరుపతమ్మ అనే దివ్యాంగురాలు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వచ్చారు. కాళ్లు, చేతులు, నడుము పనిచేయడం లేదని, ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనం కావాలని కోరగా కలెక్టర్ సంక్షేమ అధికారి వేణుగోపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. 2 గంటల్లో లక్షా 20 వేల రూపాయల విలువ కలిగిన ఎలక్ట్రికల్ బ్యాటరీ వీల్ చైర్‌ను తెప్పించి దివ్యాంగురాలికి అందజేశారు. ఎఫ్‌ఆర్‌ఓ స్వర్ణలత, అధికారులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో సర్వే

కోల్‌సిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు గోదావరిఖని పోచమ్మ మైదానంలోని వివాదాస్పద స్థలానికి సంబంధించి సోమవారం అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేయర్, ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో సర్వే జరిగింది. పెద్దపల్లి ఏడీ శ్రీనివాస్, సిబ్బంది పట్టాదారులు, సింగరేణి అధికారులు వివాదస్పద స్థలంలో భవనాలు నిర్మించుకున్న మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల సమక్షంలో సర్వే జరిపారు. జనగామ శివారు సర్వే నెం.683, 693, 694కు సంబంధించి సర్వే జరిగింది. గోదావరిఖని దుర్గానగర్ సమీపంలోని కబరస్థాన్, అడ్డగుంటపల్లి చెరువు తదితర ప్రాంతాల గుండా పాయింట్లు తీసుకుని సర్వే జరిపారు. మరో వైపు కొందరు ప్రైవేట్ ట్రాకర్లు కూడా సర్వే సందర్భంగా పరిశీలన జరిపినట్టు సమాచారం. సర్వే నేపథ్యంలో పోలీసులు చౌరస్తా ప్రాంతంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా సర్వాయి పాపన్న జయంతి

జిల్లా వ్యాప్తంగా సర్వాయిపాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి, విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న పుట్ట మధు

ఎలిగేడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ధూళికట్ట, ముప్పిరితోట, ఎలిగేడు, సుల్తాన్‌పూర్, నర్సాపూర్ గ్రామాల్లో సోమవారం బహుజన రాజ్యస్థాపకుడు సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి చేసిన సేవలను కొనియాడారు. నర్సయ్య, చీకటి సంతోష్, పూదరి వెంకటేశం, బత్తిని శ్రీనివాస్, రంగు శ్యాం, పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): గామాల్లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. మాజీ ఎంపీపీలు సారయ్య గౌడ్, సంపత్ యాదవ్, మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, నాయకులు సదయ్య, రాజకొమురయ్య, సదానందం గౌడ్, పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): సబ్బితం ఎల్లమ్మ తల్లి ఆలయంలో పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం అధ్యక్షుడు సుద్దాల సతీష్ గౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ముక్కెర రాజేష్ గౌడ్, తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం, సామాజిక రాజకీయ సమానత్వం కోసం పోరాడిన యోధుడు సర్వాయి పాపన్న తెలిపారు. నాయకులు పాపన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): సర్వాయి పాపన్న జయంతిని పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో కాలనీలో జరిగింది. గౌడసంఘం అధ్యక్షుడు దశరథంగౌడ్ పాపన్న చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం కేక్ కట్ చేశారు. అల్లూరులో ఈవీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతిని నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ ఇరికి మహేష్, మారెల్లి చిన్నరాజిరెడ్డి, ఈశ్వర్‌నాయక్, సత్యనారాయణగౌడ్, అంజయ్య, రాజయ్యగౌడ్, రవిగౌడ్ పాల్గొన్నారు. సింగరేణి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్జీ-2 బ్రాంచి ఆధ్వర్యంలో ఓసీపీ-3లో సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని నిర్వహించారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని సెంటనరీకాలనీలో గీతకార్మికులు జరుపుకున్నారు. మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్కకొమురయ్యగౌడ్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.


మంథని, (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు క్యాంపు ఆఫీసు ఆవరణలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అయిలి ప్రసాద్, శ్రీనివాస్, వెంకన్న, కిరణ్‌గౌడ్, పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా పాత పెట్రోల్ పంప్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పుట్ట మధు, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు పూల మాలలు వేసి నివాళుర్పించారు. మంథనిలో తాను బహుజనుల కోసం పాపన్నగౌడ్ వారసుడిగా పోరాడుతున్నానన్నారు. ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, అనంతరెడ్డి, పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాగపురి రవి గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్ చీకట్ల ముండయ్య, సిరిసేటి రాహుల్, బైరి రవీందర్‌గౌడ్, పచిమట్ల శ్రీనివాస్, ఆకుల మహేందర్, వెంకటస్వామి, పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపాన్న ఆశయాలను కొనసాగించాలని గౌడ సంఘం నాయకులు వంగ శ్రీనివాస్ అన్నారు. గోదావరిఖని రేణుక ఎల్లమ్మ గుడి వద్ద పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోడెం సురేందర్, బెందం నాగభూషణం, మండ రమేష్, గడ్డం రవి, పొన్నం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ పిలుపునిచ్చారు. పాత జెండా చౌరస్తా వద్ద గల పాపన్న విగ్రహం వద్ద జయంతి వేడుకలను నిర్వహించారు. తాళ్లపల్లి మనోజ్ గౌడ్, అబ్బయ్య గౌడ్, మంద శ్రీనివాస్ గౌడ్, అంతటి లచ్చయ్య గౌడ్, పాల్గొన్నారు.



పాపన్నగౌడ్ జయంతి ఉత్సావాల్లో పాల్గొన్న నాయకులు

రేజంగ్ల రజ్ కలశ యాత్రకు ఘన స్వాగతం



జెండా చౌరస్తాలో కలశ యాత్రకు స్వాగతం పలుకుతున్న యాదవులు

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణానికి చేరుకున్న రేజంగ్ల రజ్ కలశ యాత్రకు అఖిల భారత యాదవ మహాసభ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందనవేన రాజేందర్, తమ్మడబోయిన ఓదెలు యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం స్వాగతం పలికారు. కమాన్ నుంచి జండా చౌరస్తా వరకు యాత్ర కొనసాగించారు. నల్గొండ జిల్లాకు చెందిన సైనికుడు జక్కుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో తలపెట్టిన యాత్రను ఉద్దేశించి మాజీ సైనికుడు మేకల విజయ్ కుమార్ యాత్ర విశేషాలను వివరించారు. చైనా, భారత్ యుద్ధంలో అమరులైన యాదవ సైనికుల మట్టి కలశం యాత్ర సాగుతున్నదన్నారు. స్టేట్ కౌన్సిల్ మెంబర్ చిలారపు పర్వతాలు యాదవ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, రాజం మహంత కృష్ణ, అట్ల సాగర్ యాదవ్, నాగరాజు యాదవ్, పాల్గొన్నారు.


కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): చైనా, భారత్ యుద్ధంలో అమరులైన యాదవ సైనికుల మట్టి కలశం యాత్ర గోదావరిఖనికి చేరుకోగా మున్సిపల్ టీ జంక్షన్ వద్ద పాతపెల్లి రవియాదవ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మెండె లింగయ్య, బోయిని మల్లేష్, పోషం, ఆర్‌కే, కుమార్, చుక్కల శ్రీనివాస్, రాజన్న, రేడియం శ్రీను, రవికుమార్ పాల్గొన్నారు.

కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


కోల్‌సిటీటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఇండో-నేషాల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్ గుడ్ మార్నింగ్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. పి.వశికర్, ఆర్.భవాని అత్యుత్తమ ప్రతిభ కనపర్చి ప్రథమ బహుమతులు సాధించారు. సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో అసమాన ప్రతిభను చూపిన విద్యార్థులు ట్రోఫీతో పాటు సర్టిఫికెట్లు అందుకున్నారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను సోమవారం పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ అదర్‌సండె సమ్మారావు, ప్రిన్సిపాల్ చందుపట్ల తిరుపతిరెడ్డి, డైరెక్టర్ ఊర సమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

వాలీబాల్ స్టేట్ మీట్‌కు ఎంపిక

సుల్తానాబాద్, ఆగస్టు 18. (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వి అక్షత్ గౌడ్ అనే విద్యార్థి అండర్ 15 విభాగంలోవాలీబాల్ స్టేట్ మీట్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 19 నుంచి రెండు రోజుల పాటు హైదరాబాద్ సరూర్ నగర్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాలొంటాడు. అక్షిత్‌ను ప్రిన్సిపాల్ కవిత, వీడీ ఆసియా బేగం సన్మానించారు.




ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి



కార్మికులతో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆపరేటర్లకు పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈపీ ఆపరేటర్లకు బ్యాక్ డేట్‌తో ప్రమోషన్లు ఇవ్వాలని, డ్రిల్ ఆపరేటర్లకు మెరుగైన క్యాడర్ స్కీం అమలు చేయాలని కోరారు. ఓసీపీ-3 ప్రాజెక్టులో కనీస వసతులు లేవని, ప్రాజెక్టు అధికారులు కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వసతులు కల్పించాలని రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. గెలిచిన సంఘాలు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, జూలైలో జరిగిన మెడికల్ బోర్డులో కార్మికులకు అన్యాయం జరిగినా గెలిచిన సంఘాలు స్పందించకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. కార్మికులను కలిసిన వారిలో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ దావు రమేష్, పిట్ సెక్రెటరీ ఆరె మల్లేష్, నవీన్, నర్సయ్య, రవి, రాజు ఉన్నారు.

సమిష్టి కృషితో బొగ్గు ఉత్పత్తి సాధించాలి



మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

గోదావరిఖని, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సమిష్టి కృషితో బొగ్గు ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచాలని ఏజీఎం(ఐఈడీ) అంజనేయులు అన్నారు. ఆర్జీ-1 పరిధిలో వారం రోజులుగా నిర్వహిస్తున్న మల్టీ డిపార్ట్‌మెంటల్ ముగింపు సమావేశం సోమవారం ఆర్‌సీఓఏ క్లబ్‌లో జరిగాయి. సింగరేణి చైర్మన్ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా అన్నీ గనులపై, కార్యాలయాలపై మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు నిర్వహించామని, పని స్థలాల్లో బాధ్యతలను, సంస్థను ఎలా ముందుకు తీసుకెళ్లడానికి తీసుకోవాల్సిన ప్రణాళికలపై సమావేశం నిర్వహించినట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ సమిష్టి కృషితో, అంకిత భావంతో రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని చేసినప్పుడే సంస్థ లాభాల బాటలో పయనిస్తుందన్నారు. బ్రహ్మాజీ, రవీందర్‌రెడ్డి, మోహన్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశం

రామగిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అధ్యక్షతన మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఉద్యోగులకు సంస్థ స్థితి గతులు, ఏరియా ఆర్థిక పరిస్థితులపై అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో తీసుకోవాల్సిన అంశాల పై ఉద్యోగులకు జీఎం దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.